క్లుప్తంగా

నేడు సోషల్ ఆడిట్

కారంపూడి: కారంపూడి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉదయం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై సోషల్ ఆడిట్ జరుగుతుందని ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. వివిధ గ్రామాలలో ఏడాదిగా జరిగిన ఉపాధి హామీ పనులపై ఆడిట్ జరుగుతుందని పేర్కొన్నారు. ఆడిట్ బృందాలు తమ నివేదికలను ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఉన్నతాధికారుల సమక్షంలో ప్రజలకు బహిరంగ చర్చా వేదిక ద్వారా వెల్లడిస్తారని ఎంపీడీఓ వివరించారు.

తోటివారికి సహాయ పడాలి



మాచర్ల రూరల్: శాంతి, సమానత్వంతో జీవిస్తూ తోటి వారికి సహాయపడినప్పుడే దేవుని కృపకు పాత్రులవుతారని ఫాదర్ కొమ్మారెడ్డి ఇన్నారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి ఆర్‌సీఎం చర్చి వార్షికోత్సవంలో భాగంగా ఆయన మాట్లాడారు. దేవుడు దయామయుడని, ప్రతి ఒక్కరూ విశ్వాసంతో పరిశుద్ధంగా జీవించాలని సూచించారు. పాడిపంటలు సమృద్ధిగా అందించి దీవించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఫాదర్ మ్యాథ్యూస్, సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ



మాచర్ల: విద్యార్థులు బాగా చదివి ఉన్నతంగా తయారు కావాలని ఎస్ఆర్ఐ వాసవీ అసోసియేషన్ సేవా సంస్థ నిర్వాహకులు పందిరి బాల గురవయ్య సూచించారు. సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఎస్ఆర్ఐ వాసవీ అసోసియేషన్ సేవా సంస్థ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులు బాలికోన్నత పాఠశాలకు రూ.30 వేల విలువైన పాఠ్యపుస్తకాలు, గ్రంథాలయానికి మెటీరియల్‌ను పంపిణీ చేశారు. పందిరి బాల గురవయ్య మాట్లాడుతూ ఏటా తమ సమితి తరపున సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం బాలికలకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ వేముల నాగయ్య, పందిరి పుల్లారావు, పంతంగి లక్ష్మీనారాయణ, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతిపై కేసు



దాచేపల్లి : వ్యక్తి మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సంధ్యారాణి తెలిపారు. కారంపూడి మండలం గాదెవారిపల్లెకు చెందిన కునిరెడ్డి మూడవ సైదారెడ్డి(58) నారాయణపురంలోని బ్రహ్మనాయుడు ఆడిటోరియం వద్ద మృతిచెంది ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. మూడవ సైదారెడ్డి కుమారుడు నాగార్జునరెడ్డి అనారోగ్యంతో నారాయణపురంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. కుమారుడిని చూసేందుకు వచ్చిన మూడవ సైదారెడ్డి ఆకస్మికంగా మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ సంధ్యారాణి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మూడవ సైదారెడ్డి గుండెపోటుకు గురై మృతి చెందినట్లుగా స్థానికులు చెబుతున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కంటైనర్



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో పెద్ద కంటైనర్ డివైడర్‌ను ఢీకొన్న ఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. దీంతో ఐలాండ్ సమీపంలో హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

బల్లలు, కుర్చీలు బహూకరణ

బాలెమర్రు(క్రోసూరు): మండలంలోని బాలెమర్రు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన ముసులూరి నాగేశ్వరరావు 12 బల్లలు, రెండు కుర్చీలు, రెండు టేబుళ్లు బహూకరించారు. సోమవారం పాఠశాల హెచ్ఎం తూమాటి శరత్‌కుమార్‌కు వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి, క్రోసూరు, పెదకూరపాడు ఎంఈఓలు వై.వెంకటేశ్వరరావు, జి.యేసురత్నం, ఏకుల ప్రసాదరావు పాల్గొని, దాతను అభినందించారు. అందుకూరు ఎంపీయూపీ పాఠశాల హెచ్ఎం ఎం.కృష్ణంరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కపోతేశ్వరస్వామి తిరునాళ్ల

నకరికల్లు: చేజర్లలోని కపోతేశ్వరస్వామి తిరునాళ్ల సోమవారం కన్నులపండుగగా జరిగింది. అర్చకులు కొండకావూరి వెంకట్రామయ్యశాస్త్రి ఆధ్వర్యంలో స్వామి తిరునాళ్ల మహోత్సవం జరిపించారు. ముందుగా సుప్రభాతసేవ, మేలుకొలుపు, రుద్రహోమం, బలిహరణ, గ్రామోత్సవం నిర్వహించారు.

సుందరంగా దూబచెరువు

- వడివడిగా అభివృద్ధి పనులు
- ఎల్లో మీడియాకు కనిపించని ప్రగతి
- కట్టు కథలతో అసత్య ప్రచారం



దూబచెరువు వద్ద పిల్లల పార్కు ఏర్పాటుకు సిద్ధం చేసిన స్థలం



ఇదిగో ఈ చిత్రమే దూబచెరువు వద్ద అభివృద్ధి పనులు జరిగాయనడానికి నిదర్శనం. చెరువు చుట్టూ తీర్చిదిద్దిన వాకింగ్ ట్రాక్ ఇది. దీనికి ఇరువైపులా మొక్కలు కూడా నాటారు. కానీ ఇది ప్రతిపక్షాలకు, ఎల్లో మీడియాకు కనిపించకపోవడం గమనార్హం.

గురజాల: దూబచెరువును సుందర సరోవరంగా తీర్చిదిద్దేందుకు నగర పంచాయతీ పాలకవర్గం శ్రీకారం చుట్టింది. దీనికోసం చేపట్టిన పనులు వడివడిగా సాగుతున్నాయి. ఇవేమీ కనిపించని ఎల్లో మీడియా నిధుల దుర్వినియోగం అంటూ కట్టుకథలతో అసత్య ప్రచారాలు చేస్తోంది. అభివృద్ధే అజెండాగా ముందుకు సాగుతున్న నగర పంచాయతీ పాలకవర్గంతోపాటు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని అప్రతిష్టపాలుచేసేందుకు విష ప్రచారం చేస్తోంది. దీనిపై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

400 ఏళ్లకు పైబడి చరిత్ర

గురజాల పట్టణ ప్రజలకు మంచినీటిని అందిస్తున్న దూబచెరువుకు 400 ఏళ్లపైబడి చరిత్ర ఉంది. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఈ చెరువు అభివృద్ధికి నోచుకోలేదు. గతంలో ఇక్కడ పశువులు, పందులు సంచరించేవి. గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దూబచెరువు దుస్థితిని గమనించి గెలిచిన వెంటనే అభివృద్ధికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు చెరువు ఆధునికీకరణకు రూ.1.80 కోట్లు మైనింగ్ గ్రాంట్ ద్వారా విడుదల చేశారు. ఈ నిధులతో ఇప్పటికే చెరువును బాగు చేశారు. ఒకపక్క మంచినీటిని సరఫరా చేస్తూనే మరోవైపు చెరువు పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. ఉదయం, సాయంత్ర వేళల్లో పట్టణ ప్రజలు వాకింగ్ చేసుకునేందుకు వీలుగా ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. ఆహ్లాదం కోసం ఇరువైపులా మొక్కలు నాటారు. విద్యుత్ దీపాలతో అలంకరణ పనులు చేపట్టారు.

పార్కు, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ప్రణాళిక

మిగిలిన నిధులతో పిల్లలు ఆడుకునేందుకు పార్కు, చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రణాళికలు రూపొందించారు.

గతం కన్నా మిన్నగా..



గత ప్రభుత్వం దూబచెరువును పట్టించుకోలేదు. అస్తవ్యస్తంగా ఉన్న చెరువును వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక మిన్నగా ఆధునికీకరించాం. గతంలో చెరువుపైకి వెళ్లాలంటే భయాందోళన కలిగించే పరిస్థితులు ఉండేవి. కానీ ఇప్పుడు చెరువు పరిసరాలు అందంగా మారాయి. వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటుచేయడంతో పాటు లైటింగ్, మొక్కల పెంపకం వంటి పనులు చేపట్టాం. త్వరలో పిల్లల పార్కు, జిమ్, ఫెన్సింగ్ ఏర్పాటు పనులు చేపడతాం. దీనికోసం ప్రణాళికలు రూపొందించాం.

– పోలు పవన్మయి వీరారెడ్డి,
నగర పంచాయతీ చైర్‌పర్సన్ గురజాల

సంక్షేమ పథకాలే మా ధైర్యం

- అందుకే ప్రజల్లోకి వెళ్తున్నాం
- ప్రభుత్వంపై వంద శాతం సంతృప్తి
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ధీమా



దాచేపల్లి 10వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడ్డాయని, అందుకే ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లగలుగుతున్నామని గురజాల శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి చెప్పారు. నగర పంచాయతీ పరిధిలోని 10వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య దంపతులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. పలు చోట్ల ఎమ్మెల్యే కాసుకు మహిళలు హారతి పట్టారు. వార్డు పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఎమ్మెల్యే సంక్షేమ పథకాల గురించి వివరించారు. మూడేళ్లలో ప్రతి గడపా పొందిన లబ్ధి గురించి చెప్పి కరపత్రాలు అందించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ పాలనలో ప్రజలంతా వంద శాతం సంతోషంగా ఉన్నారని చెప్పారు. సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. 10 వార్డులోని ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాల్‌ను రూ.10 లక్షలతో నిర్మించామని, మరో రూ.15లక్షలతో కమ్యూనిటీ హాల్‌ను సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. 10వ వార్డులోని వీర్ల అంకమ్మతల్లి ఆలయం వద్ద కల్యాణ మండపం నిర్మాణానికి నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య రూ.10 లక్షలు సొంత డబ్బులు ఇచ్చారని, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు రూ.15 లక్షల ఎంపీ నిధులు ఇస్తామని మాట ఇచ్చారని, మరో రూ.25 లక్షల మైనింగ్ నిధులూ మంజూరు చేయించి కల్యాణ మండపం నిర్మిస్తామని ఎమ్మెల్యే కాసు వెల్లడించారు. హిందూ శ్మశాన వాటికకు రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయని, మరో రూ.15 లక్షల నిధులు మంజూరు చేయించి శ్మశాన వాటిక అభివృద్ధి, పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కాసు పేర్కొన్నారు. ముస్లిం శ్మశాన వాటికకు రూ.15 లక్షల నిధులను 15వ ఆర్థిక సంఘం నుంచి మంజూరు చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వార్డుల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నగర పంచాయతీ, ప్రభుత్వం కృషి చేస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కటకం జయశ్రీ, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండల మాజీ కన్వీనర్ షేక్ జాకీర్‌హుస్సేన్, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి పేరుపోగు రాజశేఖర్, సచివాలయం కన్వీనర్ కొప్పుల శ్రీనివాసరావు, యార్డు డైరెక్టర్ యర్రంశెట్టి సైదారావు, నాయకులు కొప్పుల రవికుమార్, కుందురు తిరుపతిరెడ్డి, కొప్పుల కృష్ణ, అంబటి ఆంజనేయులు, గండ్రికల సైదారావు, కొప్పుల గిరి, కూరకుల దిలీప్, కొమ్మా కరుణకర్, ఫీలేన్, కొత్వాల్ సైదా, దాచేపల్లి సైదారావు, మునగా శ్రీనివాసరావు, ముద్ర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీలుగా బీసీలకు ప్రాధాన్యం భేష్

పిడుగురాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీల కేటాయింపులో బీసీలకే అధిక ప్రాధాన్యం ఇచ్చారని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చెప్పారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థలు, ఎమ్మెల్యే, గవర్నర్ కోటాలో ఉన్న 18 స్థానాల్లో బీసీలకు 11, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1, ఓసీలకు 4 స్థానాలను కేటాయించడం అభినందనీయమన్నారు. టీడీపీ హయాంలో బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గా వాడుకున్నారని , వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తూ వారికి రాజకీయంగా, సామాజికంగా ఎంతో సముచిత స్థానాన్ని కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని కొనియాడారు. పల్నాడు ప్రాంతం నుంచి మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నంకు అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ కొమెర పద్మావతి, కొమెర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ అండగా ప్రభుత్వం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
అడిగొప్పలలో గడపగడపకు మన ప్రభుత్వం



అడిగొప్పలలో ప్రభుత్వ అందించిన లబ్ధి గురించి మహిళకు వివరిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీఆర్కే

దుర్గి: అన్ని వర్గాల ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. సోమవారం అడిగొప్పల గ్రామంలో పదో రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మహిళలు, గ్రామస్తులు, ఉత్సాహంగా ప్రభుత్వ విప్ పీఆర్కేకు ఘన స్వాగతం పలికారు. పీఆర్కే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరిస్తూ వారికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను తెలుసుకునేందుకు పీఆర్కే తమ ఇంటికి రావటంపై మహిళలు సంతోషం వ్యక్తం చేస్తూ హారతులతో దీవించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కోట్లాది రూపాయలు వెచ్చించి పలు అభివృద్ధి కార్యక్రమాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టామని వివరించారు. రెండు సచివాలయాలను, రైతు భరోసా కేంద్రాలను వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజలు పీఆర్కే దృష్టికి తీసుకువచ్చి సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో సర్పంచ్ నాలి రామయ్య, వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాసరావు, ఊరుబండి యోగయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్, ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్, నాయకులు నలబోతు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ షేక్ హుస్సేన్, పార్టీ కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయ్, కొనకంచి బాబు, కటకం చిన వెంకటయ్య, నాగెండ్ల లక్ష్మీనారాయణ, జంగా యలమంద, నాలి శ్రీను, షేక్ నాగుల్ మీరా, రాయల మధుబాబు, శివకృష్ణ, సంక్రాంతి, గురువులు, తాళ్ళ అంబారావు, కోట బ్రహ్మం, మల్లెతోట జాని, వేముల సత్యనారాయణ, రాయపాటి నాగేశ్వరరావు, జక్క రమేష్, గుండాల వెంకటరామయ్య, ఉప్పు రామకృష్ణ, షేక్ జాని, మాచర్ల జార్జి తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



కనకేశ్వరరావు మృతదేహం

మాచర్ల రూరల్: అనారోగ్య సమస్యలను తట్టుకోలేక పురుగుమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జరిగింది. పట్టణానికి చెందిన గంగిశెట్టి కనకేశ్వరరావు (50) పురుగుమందు కంపెనీలో గుమాస్తాగా పనిచేస్తున్నారు. కొన్ని రోజుల నుంచి గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతూ అది తట్టుకోలేక రాయవరం జంక్షన్ బస్టాప్‌లో పురుగుమందు తాగి మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అలివలలతో చేపల వేటపై కఠిన చర్యలు చేపట్టాలి

విజయపురిసౌత్: కృష్ణా జలాశయంలో అలివలలతో చేపల వేట చేసే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కనకదుర్గా ఫిషర్‌మెన్ కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కారే ముసలయ్య చెప్పారు. సోమవారం విజయపురిసౌత్‌లోని డౌన్ మార్కెట్‌లో మత్స్యకారులతో ఆయన సమావేశం నిర్వహించారు. వెల్దుర్తి మండలం కేపీగూడెం పరిధిలోని కృష్ణా జలాశయంలో ఆ ప్రాంత సుగాలీలు ప్రభుత్వ నిషేధిత అలివలలు, రింగు వలలతో చేపల వేట చేస్తూ మత్స్య సంపదను నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేమని ప్రశ్నిస్తే మత్స్యకారులపై ఎదురు దాడులకు దిగుతున్నారని చెప్పారు. నిషేధిత వలలతో చేపల వేట చేసే వారితో పాటు మత్స్య సంపదను అక్రమంగా రవాణా చేసే బోట్ల యజమానులపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో కనకదుర్గా ఫిషర్‌మెన్ కో–ఆపరేటివ్ సొసైటీ సెక్రటరి శ్రీను, ఉపాధ్యక్షుడు ఆనంద్, మల్లికార్జున, పూరి ఎల్లారావు, భూలోకం, కోదండ, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి

మాచర్ల: విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని, అందుకే ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి చెప్పారు. సోమవారం పట్టణంలోని నరిశెట్టి కల్యాణ మండపంలో పల్నాడు జూనియర్ కళాశాల 21వ వార్షికోత్సవంలో వారు ముఖ్య అతిథులుగా మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ వేముల నాగయ్య, కళాశాల డైరెక్టర్లు పఠాన్ నాగూర్‌వలి, ప్రిన్సిపాల్ భాస్కర్, డైరెక్టర్లు నారాయణ, శాస్త్రి, మస్తాన్‌వలి, కాశి, అధ్యాపకులు జేవీకేఎస్ ప్రసాద్, లక్ష్మీనారాయణ, కిడ్స్ పాఠశాల హెచ్ఎం రామకృష్ణ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎదగాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గొట్టిముక్కల పవన్‌రెడ్డి

పిడుగురాళ్ల: గ్రామీణ స్థాయి క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎదగాలని వైఎస్సార్ సీపీ గురజాల నియోజకవర్గ యువజన విభాగం నాయకుడు గొట్టిముక్కల పవన్‌రెడ్డి చెప్పారు. పట్టణంలోని స్కాలర్ డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కార్క్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ 9వ రోజున గొట్టిముక్కల పవన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. టాస్ వేసి తొలి మ్యాచ్‌ని ప్రారంభించారు. మొదటి మ్యాచ్‌లో ఎస్ఎస్ సీసీ, లగాన్ సీసీ జట్ల మధ్య పోటీ జరగ్గా ఎస్ఎస్ సీసీ గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో క్రేజీబాయ్స్, వివేకానంద సీసీ కొండమోడు జట్ల మధ్య పోటీ జరగ్గా క్రేజీబాయ్స్ జట్టు విజయం సాధించింది.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పిడుగురాళ్ల రూరల్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మండలంలోని చెన్నాయిపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి గురజాల శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్, జంగా కృష్ణమూర్తి, నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణదేవరాయలు హాజరు కానున్నట్లు వివరించారు.

22 నుంచి తపస్సుకాల ఉపవాస దీక్షలు

రెంటచింతల: లోక రక్షకుడైన ఏసుక్రీస్తు అంతిమ గడియలలో పడిన కష్టాలను స్మరించుకుంటూ చేపట్టనున్న 40 రోజుల ఉపవాస దీక్షలు ఈనెల 22 నుంచి ప్రారంభంకానున్నట్లు స్థానిక కానుకమాత చర్చి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఏరువ లూర్థుమర్రెడ్డి చెప్పారు. సోమవారం ఫాదర్ లూర్థుమర్రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కానుకమాత చర్చిలో బుధవారం ఉదయం 5.30 గంటలకు దివ్య పూజా బలిని నిర్వహించి భక్తులకు తపస్సుకాలం ఆవశ్యకతను వివరించారు. దీక్ష తీసుకున్న భక్తుల నుదిటిన విబూదిని అద్ది, జపమాలను మెడలో వేసి ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నట్లు చెప్పారు. పోప్ ఫ్రాన్సిస్ చెప్పిన 10 సూచనలు పఠించి సన్మార్గంలో నడిస్తే ఉత్తమ ఫలితాలను పొందుతారని పేర్కొన్నారు. దీక్ష తీసుకున్న వారు 40 రోజుల పాటు ఈ తపస్సుకాల ప్రార్థనలలో పాల్గొని సాయంత్రం ఏసుక్రీస్తు శిలువ ధ్యానం గుర్తుచేసుకుంటూ ఉంటారని వివరించారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేయాలి

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: మార్కెట్ యార్డు అభివృద్ధి కోసం నూతన పాలక మండలి నడుం బిగించాలని గురజాల ఎమ్మెల్యే కాసు మహేస్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో కొత్త కార్యవర్గ మొదటి సమావేశం సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యేకు పాలకవర్గం ఘన స్వాగతం పలికింది. ముందుగా పాలక వర్గం పేర్లతో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం మార్కెట్ యార్డు సమావేశ మందిరంలో పాలకవర్గ సమావేశానికి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యార్డు పరిధిలోని పిడుగురాళ్ల, మాచవరం మండలాల్లోని డొంక, గ్రావెల్ రోడ్లను పరిశీలించి పనులు చేపట్టాలన్నారు. అనంతరం యార్డు ఆదాయ, వ్యయాలను మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి కె.ఈశ్వరరావు చదివి వినిపించారు. పట్టణంలో రైతు బజారు ఏర్పాటుకు మున్సిపాలిటీ స్థలం కేటాయించటంపైనా, గోదాముల మరమ్మతులపైనా పాలక వర్గ సభ్యులు చర్చించారు. మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ కొమెర పద్మావతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైస్ చైర్మన్ వంకాయల రమేష్, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఎండీ గఫార్, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు చింతా వెంకట రామారావు, చల్లా పిచ్చిరెడ్డి, డైరెక్టర్లు కొమెర వెంకటేశ్వరరావు, పతంగి వాణి ,అమర్, చీదేళ్ల రేవతి, కృష్ణ, నెమలి కంటి సైదులు, మందా యోహోషువ, చల్లగుండ్ల వెంకాయమ్మ, స్వామి, పందిటి వెంకటేవ్వరరెడ్డి, షేక్ సిలార్‌బి, బికారీ సాహెబ్, బీరవల్లి కొట్టిరెడ్డి, నేలటూరి రత్నాకరరావు, వీర్ల కాశమ్మ, సుబ్బారావు, బానావత్ రమణాబాయి, చిన్న కోటయ్య, ముండ్లపాటి రామోమన్, కె సూర్యప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లు పిచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వీరభద్రుని రామిరెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు తాటికొండ చిన్న ఆంజనేయులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

అచ్చంపేట: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పౌష్టికాహారం కోసం జిల్లా పరిషత్ తరపున రూ.50లక్షలు కేటాయించినట్లు జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం ఆయన పౌష్టికాహారం పంపిణీ చేశారు. గతంలో ఒక్కొక్క విద్యార్థికి రోజుకు రూ.5లు మాత్రమే కేటాయించేవారని, ఈ ఏడాది నుంచి రూ.7.50లు చేసినట్లు చెప్పారు.

రజకులకు సముచిత ప్రాధాన్యం

దుర్గి: వైఎస్సార్ సీపీ పాలనలో రజకులకు సముచిత స్థానం లభిస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు, ఏపీ రాష్ట్ర రజక సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు చెప్పారు. మండలంలోని కంచరగుంటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చేదోడు కార్యక్రమం ద్వారా అర్హత ఉన్న రజకుల కుటుంబాలకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేస్తూ బీసీలకు నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. టీడీపీ హయాంలో 40 ఏళ్లు నిండిన రజకులకు పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రజకులకు మేలు చేస్తోందని, సర్కారుకు తాము అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రజక సంఘాల లీగల్ సెల్ అధ్యక్షుడు కంభంపాటి కోటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు వినుకొండ పాపారావు, చట్టు సైదారావు, ఓడల నాగరాజు, కేతరు మధు, నాగెండ్ల లక్ష్మీనారాయణ, నర్సారావుపేట పార్లమెంట్ బీసీ ప్రతినిధి సభ్యులు వేముల పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

పీటీజీ పాఠశాలలో సామాజిక న్యాయ దినోత్సవం



పీటీజీ పాఠశాలలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

విజయపురిసౌత్: సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షులు, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.మధుబాబు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పీటీజీ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. జడ్జి మధుబాబు మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులు చట్టం, న్యాయ వ్యవస్థలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రభుత్వ న్యాయవాది జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం అట్టడుగు వర్గాల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వాటిని వినియోగించుకోవాలని చెప్పారు. అనంతరం పాఠశాలలోని వసతిగృహం, మౌలిక వసతులు, టాయిలెట్లను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసనాయక్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.